రాష్ట్రంలో బీ-టాక్స్

మొదటిపేజీ తరువాయి...

పేర్కొన్నారు. మంత్రులపై సీఎంకు ఎంత పట్టు ఉన్నదో అర్థం అవుతున్నదన్నారు. రాష్ట్రంలో ఎన్నిరోజులు అధికారంలో ఉంటారో కాంగ్రెస్ నేతలకు నమ్మకం లేనట్టున్నదని, అందుకే ఉన్నప్పుడే దోచుకోవాలనే తీరుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెలకు రూ. వెయ్యి కోట్ల అప్పులు చేస్తున్నదని మండిపడ్డారు. 13 వారాల్లో రూ.13వేల కోట్ల అప్పు తీసుకున్నారని అన్నారు. మరో రూ. 4 వేల కోట్ల రుణం సేకరిస్తున్నారని చెప్పారు. జీతాలకు, పెండింగ్ బిల్లుల మంజూరుకు అప్పులు చేస్తున్నారని విమర్శించారు.

ముగిసిన ముగ్గురు రాష్ట్ర ఎంపీల పదవీకాలం

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : పలువురు రాజ్యసభ సభ్యుల పదవీ కాలం మంగళవారం ముగిసింది. ఈ జాబితాలో తెలంగాణ నుంచి ముగ్గురు బీఆర్ఎస్ ఎంపీలు సంతోశ్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర ఉన్నారు. వీరిలో వద్దిరాజును మరోసారి రాజ్యసభ సభ్యుడిగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎంపిక చేశారు. రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన సభ్యుల్లో బుధవారం 10 మంది, గురువారం 11 మంది ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

పోలింగ్ సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలి : యూటీఎఫ్

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులకు తగిన సౌకర్యాలు కల్పించి, ఎన్నికలు సజావుగా సాగటానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వికాస్‌రాజ్‌ను టీఎస్ యూటీఎఫ్ కోరింది. ఈ మేరకు యూటీఎఫ్ నేతలు కే జంగయ్య, చావ రవి.. కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతి 800 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని లేదా 800 మంది ఓటర్లు దాటిన ప్రతి పోలింగ్ స్టేషన్‌కు ఒక అదనపు పోలింగ్ ఆఫీసర్‌ను కేటాయించాలని కోరారు.

ఆ నేతలపై అక్రమ కేసు ఎత్తివేయాలి : యూఎస్‌పీసీ

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : పీఆర్‌సీ, పదోన్నతులు కోరుతూ డిసెంబర్ 29, 2020లో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించిన సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నేతలు చావ రవి, టీ లింగారెడ్డి, జీ సదానందం గౌడ్‌లపై అక్రమంగా పెట్టిన క్రిమినల్ కేసును ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని యూఎస్‌పీసీ డిమాండ్ చేసింది.

ఏవో, డీఏవో పోస్టుల భర్తీకి సమాంతర రిజర్వేషన్లు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : టీఎస్‌పీఎస్సీ డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్ (డీఏవో), అగ్రికల్చర్ ఆఫీసర్ (ఏవో) పోస్టుల భర్తీకి ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ రెండు క్యాటగిరీ పోస్టుల భర్తీలో భాగంగా సమాంతర రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు నోటిఫికేషన్‌లో సవరణలు చేసినట్టు టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ నవీన్ నికోలస్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

నూరుశాతం 'ఉపాధి' తనిఖీలు పూర్తి

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): దేశంలో ఉపాధిహామీ పనులపై నూరుశాతం గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీలు నిర్వహించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. మన రాష్ట్రంతోపాటు కేరళ మాత్రమే అన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీలు పూర్తి చేశాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలలో అమలవుతున్న ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ సంస్థ 100 శాతం తనిఖీలు పూర్తి చేసిందని పేర్కొన్నారు. 2022-23 సంవత్సరంలో చేపట్టిన పనులు, నిరుడు పెండింగ్‌లో ఉన్న పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ బృందాలు పరిశీలించినట్టు తెలిపారు. చేపట్టిన పనులను భౌతికంగా తెలుసకోవడంతోపాటు కూలీల వేతనాలు, ప్రతి జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఇంటినీ సందర్శించిన పరిశీలించాయని పేర్కొన్నారు. మండల స్థాయిలో ప్రజావేదికలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో సుమారు 2.85 లక్షల ఆర్థిక, ఆర్థికేతర అంశాలను గుర్తించినట్టు పేర్కొన్నారు.

రేపటి నుంచి జేఈఈ పరీక్షలు

- 12 వరకు మెయిన్ -2 పరీక్షలు
- రెండు గంటల ముందుగానే విద్యార్థులకు ఎంట్రీ
- పరీక్షాకేంద్రాల నుంచి 5 పట్టణాల తొలగింపు

పరీక్షాతేదీలు

పేపర్ -1 (బీఈ, బీటెక్)
ఏప్రిల్ 4, 5, 6, 8, 9

పేపర్ -2 (ఏ), 2(బీ)
ఏప్రిల్ 12

పరీక్షాసమయం

మొదటి షిఫ్ట్ : ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు
రెండోషిఫ్ట్ : మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటలు
(నోట్ - బీఆర్క్, బీప్లానింగ్ వారికి అదనంగా సమయం కేటాయిస్తారు)

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : జేఈఈ మెయిన్ -2 పరీక్షలు ఈ నెల 4 నుంచి ప్రారంభంకానున్నాయి. దేశవ్యాప్తంగా 291 నగరాల్లో, 544 సెంటర్లలో ఈ పరీక్షలను నిర్వహిస్తారు. ఈ నెల 12 వరకు జరిగే ఈ పరీక్షలకు మొత్తం 12 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మన తెలుగు రాష్ట్రాల నుంచి 50వేల మంది ఈ పరీక్షను రాయనున్నారు. పరీక్షా సమయానికి రెండు గంటల ముందుగానే అభ్యర్థులను పరీక్షాకేంద్రాల్లోకి పంపిస్తారు. ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, ఉర్దూ వంటి ప్రాంతీయ భాషల్లోనూ ఈ పరీక్షలు నిర్వహిస్తారు. బీఈ, బీటెక్ పరీక్షను జనరల్ విద్యార్థులకు 3 గంటలు నిర్వహించనుండగా, దివ్యాంగ అభ్యర్థులకు 4 గంటల పాటు జరుగుతుంది. బీఆర్క్, బీప్లానింగ్ పరీక్షను సాధారణ విద్యార్థులకు మూడున్నర గంటల పాటు నిర్వహించనుండగా, దివ్యాంగ అభ్యర్థులకు నాలుగు గంటల 10 నిమిషాల పాటు కొనసాగనున్నది. ఇప్పటికే ఈ నెల 4, 5, 6న పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల అడ్మిట్‌కార్డులను ఎన్టీఏ విడుదల చేసింది. మిగతా వారి అడ్మిట్‌కార్డులను త్వరలోనే విడుదల చేయనున్నది.

5 పట్టణాలు ఔట్

జేఈఈ పరీక్షలు నిర్వహించే పట్టణాల జాబితా నుంచి రాష్ట్రంలోని ఐదు పట్టణాలను తొలగించారు. నిరుడు రాష్ట్రంలో 16 పట్టణాల్లో ఈ పరీక్షలను నిర్వహించగా, ఈ సారి 11 పట్టణాలకే పరిమితం చేశారు. ఈసారి కరీంనగర్, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబాద్, సిద్దిపేట, వరంగల్, సూర్యాపేట, హైదరాబాద్, సికింద్రాబాద్‌లలోని పరీక్షాకేంద్రాల్లో పరీక్షలను నిర్వహిస్తారు. ఈసారి జనగామ, మేడ్చల్, సంగారెడ్డి, మహబూబాబాద్, జగిత్యాల పట్టణాలను పరీక్షాకేంద్రాల జాబితా నుంచి తొలగించారు.

భూవివాదం కేసులో కన్నారావు అరెస్టు

ఆదిబట్ల, ఏప్రిల్ 2: ఓ భూవివాదం కేసులో కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావును మంగళవారం ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఆయనకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి 14 రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు. మార్చి 3న రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 32లో 2.17 ఎకరాల స్థలం వివాదంలో ఆదిబట్ల పోలీసులు అప్పట్లో 38 మందిపై కేసు నమోదు చేశారు. అందులో ఏ4గా కన్నారావును చేర్చారు. వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి కన్నారావు రెండుసార్లు హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసినా కోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన బయటి ప్రాంతాలకు వెళ్లకుండా ముందుగానే పోలీసులు లుక్‌అవుట్ నోటీసు జారీ చేశారు. హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో ఉన్న ఓ అడ్వకేట్‌ను కలవడానికి కన్నారావు మంగళవారం రావడంతో ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తమ సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అయితే తానే పోలీసులకు సమాచారం ఇచ్చి లొంగిపోయినట్టు కన్నారావు తెలిపారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, కోర్టులో న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉన్నదని చెప్పారు.

అగ్గికి ఆజ్యం పోస్తున్న ధూమపానం

- కేర్‌లెస్ స్మోకింగ్‌తో అధిక అగ్నిప్రమాదాలు
- మండే వస్తువులను ఇండ్లలో ఉంచరాదు
- ఏసీలు, ఫ్యాన్ల వాడకం తగ్గించడమే బెటర్

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): బహిరంగ నిర్లక్ష్యంగా ధూమపానం చేయడం వల్ల అగ్నిప్రమాదాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. గత ఆరేండ్లలో జరిగిన మొత్తం అగ్నిప్రమాదాల్లో 49% 'కేర్‌లెస్ స్మోకింగ్' వల్ల, 31% విద్యుత్తు ఉపకరణాలు, షార్ట్‌సర్క్యూట్ల వల్ల, 4% గ్యాస్/బొగ్గ వల్ల, 16% ఇతర కారణాల వల్ల సంభవించినట్టు స్పష్టమవుతున్నది. కేర్‌లెస్ స్మోకింగ్ వల్ల సంభవించిన ప్రమాదాల్లో 36% బహిరంగ ప్రదేశాల్లో, 36% ఇండ్లలో, 18% వ్యవసాయ క్షేత్రాల్లో, 10% ఇతర ప్రాంతాల్లో జరిగినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అగ్నిప్రమాదాల నివారణకు ఇండ్లతో పాటు పరిశ్రమలు, స్టోరేజీ గోడౌన్లు, దుకాణాలు, అవుట్‌డోర్ స్క్రాప్ యార్డుల్లో తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర అగ్నిమాపక శాఖ సూచిస్తున్నది. ముఖ్యంగా ధూమపాన ప్రియులు సిగరెట్, బీడీ, చుట్ట కాల్చిన తర్వాత వాటిని పూర్తిగా ఆర్పివేయాలని కోరుతున్నది. ఎక్కడైనా అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే 101 నంబర్‌కు కాల్ చేయాలని అగ్నిమాపక శాఖ డీజీ వై నాగిరెడ్డి తెలిపారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- ఓవర్ లోడ్ వల్ల షార్ట్‌సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉన్నందున ఫ్యాన్లు, ఏసీలు, ఇతర విద్యుత్తు ఉపకరణాల వినియోగాన్ని తగ్గించాలి.
- వంట గదిని ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. వేస్ట్ పేపర్లు, పాత గుడ్డలు, చెక్కలు, ప్లాస్టిక్, ప్యాకింగ్ మెటీరియల్స్‌ను కిచెన్‌కు దూరంగా ఉంచాలి.
- వాహనాల్లో, కిచెన్‌లో అగ్నిమాపక సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలి.
- ఇండ్లకు అమర్చిన విద్యుత్తు తీగలను నెలకోసారి పరిశీలించండి. పడుకునేముందు 'స్విచ్చాఫ్' విధానాన్ని పాటించాలి.
- అగ్ని ప్రమాదాలపై పిల్లలకు అవగాహన కల్పించాలి. అందులో భాగంగా 'స్టాప్, డ్రాప్, రోల్' లాంటి పనులను నేర్పించాలి.

తొలిగించిన ఆర్టీసీ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్, ఏప్రిల్ 2(నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో గత కొంతకాలంగా స్వల్ప కారణాలతో తొలిగించబడిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఇతర సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. సుమారు 1500 మందికి పైగా ఉద్యోగులను స్వల్ప కారణాలతో విధుల నుంచి తొలిగించడం వల్ల వారి కుటుంబాలకు జీవనోపాధి కరువైందని తెలిపారు.

ఆర్టీసీ విడిభాగాల ధరల నిర్ణయం

- ముగిసిన ఏఎస్ఆర్టీయూ సమావేశం
- 18 రాష్ట్రాల ఆర్టీసీ అధికారుల హాజరు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ బస్సుల విడిభాగాలకు చెందిన 15 గ్రూపుల ధరలను నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అసోసియేషన్ ఆఫ్ స్టేట్ ట్రాన్స్‌పోర్టు అండర్ టేకింగ్ (ఏఎస్ఆర్టీయూ) ఆధ్వర్యంలో 210వ ప్రైస్ రివిజన్ సబ్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏఎస్ఆర్టీయూ స్టాండింగ్ కమిటీ చైర్మన్, టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌తోపాటు 18 రాష్ట్రాల ఆర్టీసీ సంస్థలకు చెందిన ఎక్స్‌పర్ట్ కమిటీల సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో బస్సుల విడిభాగాల ధరల నిర్ణయం, కొనుగోలు పాలసీ, కొత్త వెండర్ల నియామకం, తదితర అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ రాష్ట్రాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రజా రవాణా వ్యవస్థ ప్రాముఖ్యత గురించి, ఆర్టీసీల పరిరక్షణ కోసం ఏఎస్ఆర్టీయూ కృషి చేస్తుండటం అభినందనీయమని సజ్జనార్ పేర్కొన్నారు. దేశంలో ప్రజా రవాణ వ్యవస్థ వృద్ధి చెందడానికి మంచి అవకాశాలున్నాయని, అందుబాటులో ఉన్న వనరులతో ప్రజలకు మెరుగైన నాణ్యమైన సేవలందించాలని కోరారు. సమావేశంలో ఏఎస్ఆర్టీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూర్యకిరణ్, డైరెక్టర్ ఆర్ఆర్‌కే కిశోర్, టీఎస్ఆర్టీసీ సీఎంఈ రఘునాథరావు పాల్గొన్నారు.

ఖమ్మం కాంగ్రెస్‌లో ముసలం!

- ఎంపీ టికెట్‌కు ముగ్గురు మంత్రుల మధ్య పోటాపోటీ
- కుటుంబసభ్యులకు ఇప్పించుకొనే ప్రయత్నాలు
- మంత్రుల తీరుపై ఇతర నేతల గుర్రు
- అన్ని పదవులు వారికే దక్కితే.. మాకేమిటని ఆగ్రహం

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): ఖమ్మం కాంగ్రెస్‌లో ఎంపీ టికెట్ ముసలం పుట్టించింది. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు తమ కుటుంబసభ్యులకు టికెట్ ఇప్పించుకొనేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దీంతో జిల్లాకు చెందిన ఇతర కాంగ్రెస్ నేతలు గుర్రుగా ఉన్నారు. ఎంపీ సీటు కూడా మంత్రుల కుటుంబాలకే ఇస్తే ఇక తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి టికెట్లు ఇచ్చారని, ఇప్పుడు కూడా అదే జరిగితే తాము ఎప్పటికీ ఇలాగే ఉండాలా? అని పాత కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే పంథాను అనుసరించడం పార్టీకి మంచిది కాదని సూచిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో ఇతర పార్టీల నేతలను చేర్చుకొని టికెట్ ఇవ్వడంపై సొంత పార్టీలోనే తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వరంగల్ టికెట్ కడియం కావ్యకు, మల్కాజిగిరి టికెట్ పట్నం సునీతామహేందర్‌రెడ్డికి, చేవెళ్ల టికెట్ రంజిత్ రెడ్డికి ఇవ్వడంపై సొంత పార్టీ క్యాడర్ తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నారు. వారికి సహరించబోమని తెగేసి చెప్తున్నారు. వరంగల్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు తాము కావ్యకు సపోర్ట్ చేయబోమని ఆ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షికే నేరుగా ఫిర్యాదుచేసినట్టు తెలిసింది. ఇదే పరిస్థితి అన్ని నియోజకవర్గాల్లో నెలకొనడంతో అధిష్ఠానం వారిని బుజ్జగించేందుకు ప్రయత్నిస్తున్నది. కొత్త వారికి, కుటుంబసభ్యులకు టికెట్ ఇవ్వడంపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఆయన ఇటీవల ఓ కీలక మంత్రిని కలిసిన సందర్భంగా తన ఆవేదన వ్యక్తంచేసినట్టు తెలిసింది. పలుచోట్ల కుటుంబసభ్యులకే టికెట్లు ఇస్తున్నారని, మరికొన్ని చోట్ల ఇతర పార్టీ నేతలను చేర్చుకొని టికెట్లు ఇస్తున్నారని ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ ఎంపీ సీట్లు గెలుచుకోవడం కష్టమేనని ఆందోళన వ్యక్తంచేసినట్టు తెలిసింది. గ్రూపుతగాదాలు, ఇచ్చిన కుటుంబాలకే మళ్లీ మళ్లీ టికెట్లు ఇవ్వడం పార్టీలో అసంతృప్తిని పెంచుతుందని హెచ్చరించినట్టు సమాచారం. సొంత పార్టీ నేతల కన్నా ఇతర పార్టీ నుంచి వచ్చిన నేతలే తమవారికి ముద్దయ్యారంటూ అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది.

కుటుంబం కోసం తెగ ఆరాటం

ముగ్గురు మంత్రులు ఖమ్మం ఎంపీ టికెట్‌ను తమ కుటుంబసభ్యులకు ఇప్పించుకునేందుకు ఎవరి ప్రయత్నం వారు చేస్తున్నారు. పైకి ఎవరికి టికెట్ ఇచ్చినా ఓకే అంటున్నా, లోలోపల మాత్రం కత్తులు దూసుకుంటున్నారనే విమర్శలున్నాయి. మంత్రి పొంగులేటి తన తమ్ముడు వరప్రసాద్‌కు గానీ, తన వియ్యంకుడు రఘురామిరెడ్డికి గానీ టికెట్ ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరినట్టు తెలిసింది. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన కుమారుడు యుగంధర్‌కు టికెట్ ఇప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తన సతీమణి నందినికి టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. ముగ్గురు మంత్రులకు పోటీగా వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ కూడా కొన్ని రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసి, కాంగ్రెస్ పెద్దలను ఒప్పించే పనిలో ఉన్నట్టు తెలిసింది.

అసలుకే మోసం వచ్చే ప్రమాదం

ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఖమ్మం టికెట్ పైనే చర్చంతా జరుగుతున్నది. ముగ్గురు మంత్రులు పోటీ పడుతుండటంతో ఎవరికి ఇస్తారన్న ఆసక్తితోపాటు పార్టీ క్యాడర్‌లో ఆందోళన కూడా వ్యక్తమవుతున్నది. ఇది ఏ మలుపు తిరుగుతుందోనని, అసలుకే మోసం వచ్చే ప్రమాదం లేకపోలేదని కాంగ్రెస్ కార్యకర్తలు కలవరపడుతున్నారు. ఒకవేళ ఒక మంత్రికి చెందినవారికి టికెట్ దక్కితే ఇతర మంత్రులు, ఇతర నేతలు సహకరించకపోతే పరిస్థితే మిటనే ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్టు తెలిసింది.

పాలమూరు డీఐజీ సీటులో బళ్లారి ఐజీపీ

తెలంగాణలో కర్ణాటక పోలీసుల పెత్తనం

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 2: తెలంగాణ రాష్ట్రంలో కర్ణాటక అధికారుల పెత్తనం కొనసాగుతున్నది. జోగుళాంబ గద్వాల జోన్ డీఐజీ కార్యాలయం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఉన్నది. మంగళవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల ఎస్పీలు, రాయిచూర్ ఎస్పీలతో జోగుళాంబ గద్వాల జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, కర్ణాటక రాష్ట్రం బళ్లారి ఐజీపీ లోకేశ్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. సరిహద్దు చెక్‌పోస్టులు, హైవేలపై తనిఖీలకు సంబంధించి సమావేశమయ్యారు. కాగా.. బళ్లారి ఐజీపీ వచ్చి మహబూబ్‌నగర్ డీఐజీ కుర్చీలో కూర్చొని సమీక్ష నిర్వహించడం గమనార్హం. కర్ణాటక అధికారులు వచ్చి తెలంగాణ పోలీసులను ఆదేశించడం విడ్డూరం.

జోగుళాంబ జోన్ డీఐజీ సీటులో కూర్చొని సమీక్ష నిర్వహిస్తున్న బళ్లారి ఐజీపీ

2 వేల ఏండ్ల నాటి నాణేలు లభ్యం

సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి గ్రామంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బౌద్ధ క్షేత్రంలో జరిపిన తవ్వకాల్లో 2 వేల ఏండ్ల నాటి 3,700 నీసపు నాణేలు బయటపడ్డాయి. రెండు, మూడు రోజుల్లో నాణేల పూర్తి సమాచారాన్ని వెలువరిస్తామని పురావస్తు శాఖ అధికారులు తెలిపారు. —నాగారం, ఏప్రిల్ 2:

మేడ్చల్‌లో పెదరాతియుగం సమాధులు

మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలంలోని అద్రస్‌పల్లెలో పెదరాతియుగం (మెగాలిథిక్) నాటి సమాధులను కొత్త తెలంగాణ చరిత్ర బృందం గుర్తించింది. మెగాలిథిక్ సమాధికి 18 బంతిరాళ్లు గుండ్రంగా పాతి ఉన్నాయని, మధ్యలో సమాధికి పలకరాళ్లు పైకి కనిపిస్తున్నాయని చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు.

కేయూలో కడియం దిష్టిబొమ్మ దహనం

మాజీ మంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీ ఫిరాయింపును నిరసిస్తూ అంబేద్కర్ విద్యార్థి సమాఖ్య, బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు మందా నరేశ్, బొట్ల మనోహర్ మాట్లాడుతూ.. వరంగల్ ఎంపీ టికెట్ కడియం కావ్యకు కాకుండా మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. - హనుమకొండ చౌరస్తా

రేపటి నుంచి ఎక్సైజ్ కానిస్టేబుళ్లకు శిక్షణ

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ స్టేట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కానిస్టేబుళ్ల శిక్షణ ఈ నెల 4 నుంచి ప్రారంభం కానున్నది. హైదరాబాద్ అప్పా జంక్షన్ వద్దనున్న ఎక్సైజ్ ట్రైనింగ్ అకాడమీలో ఈ శిక్షణ ఏర్పాట్లు చేసినట్టు ఆ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం వెల్లడించారు. మొదటి బ్యాచ్‌లో 120 మంది ట్రైనీలకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. మిగిలిన వారిని ఫీల్డ్ ట్రైనింగ్‌కు పంపనున్నారు. అయితే మొదటిబ్యాచ్‌లో శిక్షణ ఇచ్చే 120 మంది అభ్యర్థులకు ఇప్పటికే సమాచారం ఇవ్వగా.. వారు ట్రైనింగ్ అకాడమిలో రిపోర్టు చేసినట్టు తెలిసింది. ప్రస్తుతం శిక్షణకు 475 మంది కానిస్టేబుళ్లు సంసిద్ధంగా ఉన్నట్టు ఎక్సైజ్ ఉన్నతాధికారులకు సమాచారం అందింది. కాగా శిక్షణకు రిపోర్టు చేసేందుకు ఈనెల 13 వరకు అవకాశం ఉండటంతో.. ఎక్కువ మంది అభ్యర్థులు శిక్షణకు వస్తారని అధికారులు భావిస్తున్నారు. రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఎక్సైజ్ కానిస్టేబుళ్ల శిక్షణకు ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. '400 మందితో సర్కారు చెలగాటం' పేరిట 'నమస్తే తెలంగాణ' దినపత్రిక రాసిన కథనానికి ఆయన స్పందించారు. ఇన్నాళ్లూ శిక్షణ ఇచ్చేందుకు అకాడమీని సిద్ధం చేయలేక సాకులు చెప్పిన కొందరు అధికారులు ఇప్పుడు చకచకా కార్యాచరణ మొదలుపెట్టారు.

ఆలోచిస్తే అనుకొన్నది సాధిస్తాం: బుర్రా

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : 'ఆలోచించడం వల్ల ఏమీ ఖర్చు ఉండదని, మనం అనుకున్నది సాధిస్తాం' అని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కేంద్రంగా నిర్వహించిన 2023-24 జిజ్ఞాస మూడో రోజుల కార్యక్రమాన్ని అయన ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ... విద్యార్థులు తమను తాము మార్చుకోవడమే కాకుండా వారి పరిశోధనా దృక్పథాన్ని కూడా పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని సూచించారు. కార్యక్రమంలో 145 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల నుంచి మొత్తం 5,200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 290 మంది విద్యార్థుల ప్రాజెక్టులను జిజ్ఞాస కార్యక్రమానికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి, సెక్రటరీ శ్రీరామ్‌వెంకటేశం, రూసా ఆఫీసర్ డాక్టర్ సౌందర్య, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ బాల భాస్కర్, జేడీ యాదగిరి, ప్రొఫెసర్ రాజేందర్ సింగ్ పాల్గొన్నారు.

ముగిసిన పదోతరగతి పరీక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో పదోతరగతి పరీక్షలు మంగళవారం ముగిశాయి. చివరి పరీక్ష ఒఎస్ఎస్సీ పేపర్-2 నిర్వహణతో పరీక్షలు ముగిసినట్టు అధికారులు ప్రకటించారు. ఈ ఏడాది పదోతరగతి పరీక్షలు సజావుగా నిర్వహించినట్టు తెలిపారు. పరీక్షల ఫలితాలకోసం స్పాట్ వాల్యుయేషన్ బుధవారం నుంచి ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు.

కేఎంసీలో పోస్టుల భర్తీకి 6న ఇంటర్వ్యూలు

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్2 : కాకతీయ మెడికల్ కళాశాలలో వైద్య విద్య బోధనకు కాంట్రాక్టు పద్ధతిన 54 పోస్టులను భర్తీ చేయనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్ దాస్ తెలిపారు. ఇందులో ప్రొఫెసర్ పోస్టులు 7, అసోసియేట్ ప్రొఫెసర్లు 18, అసిస్టెంట్